క్లుప్తంగా

స్పోర్ట్స్ క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ స్పోర్ట్స్ క్యాలెండర్లను అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ గురువారం ఆవిష్కరించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించిందని తెలిపారు. ఇండోనేసియాలో ఇటీవల నిర్వహించిన బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయి సాత్విక్‌రాజ్, విరాక్ విజయం సాధించారని చెప్పారు.

ఈ ఏడాదిలో పోటీలు..

అండర్ – 17 బ్యాడ్మింటన్ పోటీలను జూలై 22 నుంచి 25 వరకు నగరంలో నిర్వహించనున్నామని ద్వారకానాథ్ చెప్పారు. అండర్ – 19 బ్యాడ్మింటన్ పోటీలను చిత్తూరు జిల్లాలో జూలై 28 నుంచి 31 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. ఏపీ స్టేట్ సీనియర్ మెన్స్ అండ్ ఉమెన్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను ఆగస్టు మూడు నుంచి ఆరు వరకు నిర్వహించనున్నామని, ఇందులో సుమారు మూడు వేల మంది క్రీడాకారులు పాల్గొననున్నారని వివరించారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ ఒకటి వరకు అండర్ – 15, 17 యోనెక్స్, సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్స్ ర్యాంకింగ్ టోర్నీని నిర్వహించనున్నామని వెల్లడించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, డీఎస్డీఓ యతిరాజ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ నేతలు శ్రీకాంత్, రామ్మోహన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



నెల్లూరు రూరల్: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకుపల్లిలోని విశ్వసాయి బాలుర జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని కాంక్షించారు. మాదకద్రవ్యాలపై సమాచారం అందిస్తే తగు చర్యలు చేపడతామని, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎస్ఈబీ రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్స్ నాగేశ్వరరావు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థుల డీబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులను డీబార్ చేశారని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 1,187 మందికి గానూ 1,106 మంది హాజరయ్యారని, ఒకరిని డీబార్ చేసినట్లు వెల్లడించారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షకు 1,260 మంది విద్యార్థులకు 1,174 మంది హాజరయ్యారని, నలుగురిని డీబార్ చేసినట్లు తెలిపారు.

భూసేకరణను వేగవంతం చేయాలి

నెల్లూరు (దర్గామిట్ట): సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, అలసత్వం వహిస్తే సహించేదిలేదని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. జిల్లాకు మంజూరైన నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్లోని తన చాంబర్‌లో జేసీ కూర్మనాథ్‌తో కలిసి కలెక్టర్ గురువారం సమీక్షించారు. భూ సేకరణ పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ ఫేజ్ – 1, 2కు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియపై నిర్దిష్ట గడువును ఇచ్చామని, దీనికి అనుగుణంగా వేగవంతం చేయాలని ఆదేశించారు. సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సువర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాపై అవగాహన

కోవూరు: పశుబీమా పథకంపై రైతులు అవగాహన పెంచుకుని ఆర్థికంగా నష్టపోకుండా చూసుకోవాలని కోవూరు పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు సూచించారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో గురువారం కోవూరు, బుచ్చి, విడవలూరు, దగదర్తి, కొడవలూరు, మండలాల పరిధిలో ఉన్న పశువైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, గోపాలమిత్రలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డీఏహెచ్ఓ డాక్టర్ సురేష్, డీడీలు రమేష్‌నాయక్, సోమయ్య, డాక్టర్ ఐ.కృష్ణమౌర్య, డాక్టర్ ప్రసన్నాంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం పెద్దపట్టపుపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కుల,మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు గుడ్‌బాయ్ చెప్పి జగన్ నాయకత్వంలోని సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితురాలికి చేయూత



సుహాసినికి ఆర్థిక సాయం అందజేస్తున్న హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం పడమటికంబంపాడు ఎస్సీ కాలనీకి చెందిన కిడ్నీ వ్యాధి బాధితురాలు కత్తి సుహాసినికి హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ గురువారం చేయూతనందించింది. సుహాసినికి రెండు కిడ్నీలు దెబ్బతినడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్యఖర్చుల కోసం రూ.33,300 ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు రొండ్ల వెంకటరమణారెడ్డి, కొల్లూరు శ్రీనివాసులునాయుడు, కత్తి పెంచలయ్య, కత్తి సురేష్, సీ చిన్నరాయుడు, చిన్నా, షేక్ మస్తాన్, సందాని, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని ఎస్సీ కాలనీకి చెందిన గొల్లపల్లి దేవదానం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు వైద్యఖర్చుల నిమిత్తం జీఎంకే ట్రస్ట్ అధినేత, వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి తన ప్రతినిధుల ద్వారా రూ.5 వేలు సాయాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, జానీ, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరమ్మ తిరునాళ్ల నిర్వహించాలని ఆందోళన



ఆలయ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి

కలిగిరి: కలిగిరిలో గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్లను ఈ నెల 25 నుంచి నిర్వహించాలని కోరుతూ కొందరు గురువారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. నర్రవాడ వెంగమాంబ పేరంటాలు తిరునాళ్ల ముగిసిన తర్వాత వారం కలిగిరమ్మ తిరునాళ్లను జరపడం అనవాయితీ. గత మూడేళ్లుగా కోవిడ్, ఇతర కారణాలతో తిరునాళ్లను నిర్వహించలేదు. ఈ ఏడాది ఈ నెల 25 నుంచి తిరునాళ్ల జరపాలని ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. అయితే సూడిమాను తయారు చేసే విశ్వబ్రాహ్మణ కులస్తుడైన బ్రహ్మయ్య బంధువు మృతి చెందడంతో తాత్కాలికంగా తిరునాళ్లను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో కొందరు కలిగిరమ్మ ఆలయం వద్దకు చేరుకుని తిరునాళ్లను జరపాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. అమ్మవారి తిరునాళ్ల ఆచార వ్యవహారాలతో కూడుకున్నది కాబట్టి సహకరించాలన్నారు. అనంతరం ఆందోళన చేస్తున్న వారితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చర్చలు జరిపారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



జలదంకి: కమ్మవారిపాళెంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

జలదంకి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీదర్‌బాబు అన్నారు. మండలంలోని బ్రాహ్మణక్రాక, కమ్మవారిపాళెం సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులకు జగనన్న సురక్షపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నెల రోజుల పాటు ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న సిద్ధంరెడ్డి

జగనన్న సురక్షపై అవగాహన

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మర్రిపాడు మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని భీమవరం, అల్లంపాడు సచివాలయాల్లో జగనన్న సురక్షపై గురువారం అవగాహన కల్పించారు. జగనన్న సురక్షలో భాగంగా ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణపత్రాలను సచివాలయాల్లో నెలరోజుల పాటు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ.2.20 లక్షల విరాళం



అల్లూరు: మండలంలోని వెలిచర్లలో చేపడుతున్న గోశాల నిర్మాణానికి కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి రూ.2,20,000 విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని గోశాల నిర్వాహకుడు శ్రీనివాసులకు ఫౌండేషన్ సభ్యులు గురువారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు జోసెఫ్, కమల్‌సింగ్, మల్లిసింగ్, ప్రసాద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



ఆత్మకూరురూరల్: వెన్నవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తూ గండ్లవేడుకు బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మయ్యను గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఉపాధ్యాయుడు కలిశెట్టి రవీంద్రకుమార్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆత్మకూరు ఎంవీఐ రాములు గురువారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7,8,9 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నాడు-నేడు పనుల పరిశీలన



ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు రెండో విడత పనులను హెచ్‌ఎంలు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లు బాధ్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తిచేయాలని ఎంఈఓ మస్తాన్‌వలి సూచించారు. మండలంలోని దుర్గంపల్లి, గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో నాడు–నేడు పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని, పనులకు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ఉదయగిరి: పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని పీ సాయిగీతిక నవోదయ పాఠశాలకు ఎంపికైంది. దళితవాడ పాఠశాలకు చెందిన వీ లాస్య వెంకటగిరి గురుకుల పాఠశాలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినులను దళితవాడ పాఠశాలలో హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఉపాధ్యాయులు హుస్సేని, ఎం రామకృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నెలపొంగళ్లు

ఉదయగిరి: గన్నేపల్లి పంచాయతీలో కొలువైన అడవి పేరంటాలమ్మ నెల పొంగళ్ల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. భక్తులు పొంగళ్ల సామగ్రిని ప్రత్యేక బుట్టల్లో పెట్టుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేసి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆల్ ఇండియా క్విజ్ పోటీలు

సంగం: ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆర్‌బీఐ ఆదేశాల మేరకు సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆల్ ఇండియా మండల స్థాయి క్విజ్ పోటీలను గురువారం నిర్వహించారు. క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు సంగం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. మండల స్థాయి విజేతలను జిల్లా స్థాయికి పంపుతామని చెప్పారు. బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): గురుబ్రహ్మ, గురు శిరోమణి పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సర్వేజనా సుఖినోభవంతు సాహిత్య, సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువులకు వందనం పేరిట పురస్కారాల ప్రదానోత్సవాన్ని హైదరాబాద్‌లో జూలై తొమ్మిదిన నిర్వహించనున్నామని వివరించారు. విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, ఆధ్యాత్మికం, నాటక, తదితర రంగాల్లో వారి ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను ఈ నెల 30లోపు పంపాలని కోరారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ పక్కాగృహాలు



పొదుపు మహిళలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అర్హులందరికీ పక్కాగృహాలు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో జగనన్న గృహ లబ్ధిదారులైన పొదుపు మహిళలకు రూ.35వేల బ్యాంకు రుణ చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికీ గూడు కల్పించే లక్ష్యంతో జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు అందజేయడంతో పాటు పక్కాగృహాలను మంజూరు చేశారని తెలిపారు. పక్కాగృహాల లబ్ధిదారులైన పొదుపు మహిళలకు అదనంగా బ్యాంకు ద్వారా రూ.35వేలు రుణం మంజూరు చేస్తున్నారని వివరించారు. ఈ నిధులను అదనపు సౌకర్యాలకు వినియోగించుకుని గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బీ నాగేశ్వరరావు, మెప్మా ఐబీ అంకయ్య, సీఓ మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్లు కేవీ శ్రావణ్‌కుమార్, పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, షేక్ సర్దార్, జమీర్, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, మెప్మా సిబ్బంది సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో డిజిటల్ సేవలు



నూతన సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్‌క్రాస్ వైద్యులు

కావలి: డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం కావలి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు పురోగతిలో ఓ మైలురాయి అని బ్లడ్‌బ్యాంకు కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. కావలి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో స్త్రైడ్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇంటాస్ ఫౌండేషన్ సహకారంతో రూపొందించిన సేఫ్ ట్రాన్స్ సాఫ్ట్‌వేర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్యరంగంలో రక్త మార్పిడి ప్రతిరోజూ ఎంతో మంది ప్రాణాలను కాపాడుతోందన్నారు. రోగుల ఆరోగ్యరక్షణలోనూ రక్తమార్పిడి కీలకపాత్ర పోషిస్తోందన్నారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని సురక్షితంగా అవసరమైన రోగులకు అందించేందుకు నూతన సాఫ్ట్‌వేర్ తోడ్పడుతుందన్నారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరిరెడ్డి, వెంకటేశ్వర్లు, సాయిపవన్, కృష్ణారావు, రేవంత్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: మండలంలోని పాఠశాలల ఆవాస ప్రాంతాల పరిధిలోని బడిఈడు పిల్లలందర్నీ బడిలో చేర్పించాలని ఎంఈఓలు మస్తాన్‌వలి, తోట శ్రీనివాసరావు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధానోపాధ్యాయులతో గురువారం వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాలలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు మెరుగైన విద్యాబోధన అందిస్తోందన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. పాఠశాలల పరిధిలో డ్రాపౌట్స్ లేకుండా చూసుకోవాలన్నారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సాయినిషిత్



సాత్విక్

ఆత్మకూరు: కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మార్గదర్శి కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఐదుగురు ప్రతిభకనబరిచి సీట్లు పొందారని ఆ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు గురువారం తెలిపారు. రావిప్రోలు సాయినిషిత్ (1043812) 98.75 శాతం, కే సాత్విక్ (1045738) 97.50 శాతం మార్కులతో జిల్లాలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని చెప్పారు. అలాగే ఎం జగదీష్ (1043467), నవ్యశ్రీ (1045368), యోగితశ్రీ (1045883) సీట్లు సాధించారని తెలిపారు. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 4వ తరగతి విద్యార్థులు 15 మంది గురుకులాల్లో సీట్లు సాధించారని వివరించారు.

అచ్చమాంబ గ్రామోత్సవం



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరుమాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆమనిచిరివెళ్లలో గురువారం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అచ్చమాంబ, వెంగమనాయుడు ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థిని

అనుమసముద్రంపేట: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని కేజీబీవీ ప్రిన్సిపల్ లక్ష్మి, హెడ్స్ డైరెక్టర్ వీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా హెడ్స్ ఆధ్వర్యంలో అనుమసముద్రంపేట కేజీబీవీలో గురువారం యోగాసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా విశిష్టతను వివరించారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వివాహాల రిజిస్ట్రేషన్ చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాలకొండారెడ్డి

కావలి : పట్టణంలోని పాతూరు, పంచాంగముల వారి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వివాహ రిజిస్ట్రేషన్ చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వివాహ చట్టంపై అవగాహన కల్పించారు. మహిళలు వివాహాలను రిజిస్ట్రేషన్ చేసుకుని రక్షణ పొందాలని సూచించారు. ఐసీడీఎస్ అధికారులు పావని కుమారి, రంగ పవిత్ర మాట్లాడుతూ మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.